
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
సోమవారం 22 సెప్టెంబరు 2025



వందనాలమ్మా.. కొత్తమ్మతల్లీ

- రేపటి నుంచి శతాబ్ది ఉత్సవాలు
- పకడ్బందీగా నిర్వహణకు ఏర్పాట్లు


కోటబొమ్మాళిలో విద్యుత్ దీపాల వెలుగులు


కొత్తమ్మ తల్లి
కొత్తమ్మ తల్లి ఆలయం

కోటబొమ్మాళి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): భక్తుల పాలిట కల్పవల్లి, కోరిన కోర్కెలు తీర్చే తల్లి.. కొటబొమ్మాళి కొత్తమ్మతల్లి జాతర ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడురోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. ఉత్తరాంధ్రతోపాటు రాష్ట్ర నలుమూలలు నుంచి ఒడిశా నుంచి సైతం భక్త లు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో పకడ్బందీగా ఉత్సవాలు నిర్వహించేందుకు జిల్లా అధి కారులు, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు ఏర్పాట్లు చేస్తు న్నారు. ఈ ఏడాది వందేళ్ల ఉత్సవం.. మరోవైపు రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించడంతో.. ఆధ్యాత్మిక శోభ మరింత ఉట్టి పడు తోంది. ఎక్కడ చూసినా విద్యుత్ కాంతులు ధగధగలాడుతున్నా యి. హెలిటూరిజంతో పాటు పౌరాణిక నాటకాలు, బుల్లితెర నటీ నటులతో ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. మంత్రి కింజరాపు అచ్చె న్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డితో పాటు టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, ఆలయ ఈవో వాకచర్ల రాధా కృష్ణ ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. మంగళవారం ఉదయం 8 గంటలకు కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మో హన్‌నాయుడు, అచ్చెన్నాయుడు చేతుల మీదుగా ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఈవో రాధాకృష్ణ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

భారీ ఏర్పాట్లు..

కొత్తమ్మతల్లి ఉత్సవాల నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేస్తున్నా రు. కొత్తపేట జంక్షన్ నుంచి కోటబొమ్మాళి పెద్దచెరువు వరకు సమారు మూడు కిలోమీటర్లు పొడవునా, గ్రామ పురవీధుల్లో విద్యుత్ దీపాలంకరణలతో ముస్తాబు చేశారు. భక్తులకు ఉచిత దర్శనంతో పాటు రూ.20, రూ.50లు (మిగతా 8వ పేజీలో..)

వందేళ్ల నుంచీ జాతర

1925 సంవత్సరంలో కొత్తమ్మ తల్లి జాతర ప్రారంభమైంది. ఏటా ఈ ఉత్సవాలు మహాలయ అమావాస్య మరుసటి మంగళవారం నుంచి ప్రారంభించి.. గురువారం నాడు ముగిస్తారు. అప్పట్లో కోటబొమ్మాళికి చెందిన కమ్మకట్టు చిన్నప్పలనాయుడురెడ్డి కుటుంబ సభ్యులు, బంధువులు అమ్మవారిని కొలిచేవారు. క్రమేపీ గ్రామస్థులు, జిల్లావాసులు, ఉత్తరాంధ్ర, ఒడిశా తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లిస్తున్నారు. వందేళ్ల వేడుక వేళ.. ఈ సారి భక్తుల రద్దీ పెరగనుందని అధికారులు అంచనా వేస్తున్నారు.


సమావేశం నుంచి వెళ్లిపోతున్న జడ్పీ చైర్‌పర్సన్, వైసీపీ జడ్పీటీసీలు

ఒక్క అంశమూ చర్చించలే

- ప్రొటోకాల్ పాటించని పాలకొండ ఎంపీడీవోపై చర్యలు తీసుకోవాలని..
- వైసీపీ జడ్పీటీసీలు, ఎంపీపీల డిమాండ్
- జడ్పీ చైర్‌పర్సన్‌తో సహా సర్వసభ్య సమావేశం నుంచి వాకౌట్
- సమస్యల ప్రస్తావన లేకుండానే ముగిసిన కార్యక్రమం

శ్రీకాకుళం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు ఏ ఒక్క అంశంపైనా చర్చించలేదు. కేవలం పాలకొండ ఎంపీడీవోపై చర్యలు తీసుకోవాలని వైసీపీ జడ్పీటీసీలు, ఎంపీపీలు డిమాండ్ చేశారు. దీంతో జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ కూడా మద్దతు పలికి వాకౌట్ చేశారు. ఫలితంగా సమస్యలపై ప్రస్తావన లేకుండానే సమావేశం ముగిసింది. శ్రీకాకుళంలోని జడ్పీ సమావేశ మందిరంలో జడ్పీ చైర్‌పర్సన్ ఆదివారం ఉదయం 11.30గంటలకు సర్వసభ్య సమావేశాన్ని ప్రారంభించారు. తొలుత మైక్ అందుకున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ తన సమస్య గురించి సభలో చెప్పుకున్నారు. తనకు నాలుగురోజుల కిందట పాలకొండ మండల సర్వసభ్య సమావేశానికి ఆహ్వానం అందిందని.. సమావేశానికి వెళ్తే.. పోలీసులు తనను అక్కడకు రానీయకుండా అడ్డుకున్నారంటూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు, జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయకు తెలిపారు. ఆ తర్వాత నుంచి వైసీపీ ఎంపీపీలు, జడ్పీటీసీలు ఇదే సమస్యను ప్రస్తావిస్తూ.. 'ఎమ్మెల్సీకి ప్రొటోకాల్ ఉల్లంఘించడమేంటి?. పాలకొండ ఎంపీడీవోపై చర్యలు తీసుకుంటేనే ఈ (మిగతా 8వ పేజీలో..)


సమావేశంలో కూర్చున్న ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు, టీడీపీ జడ్పీటీసీ బుచ్చిబాబు

దసరా కానుక!

- నేటి నుంచి తగ్గనున్న జీఎస్టీ శ్లాబులు
- సామాన్యులకు అందుబాటులో ధరలు
- వస్తువుల కొనుగోలుదారులకు ఊరట





టెక్కలి రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి)

కేంద్ర ప్రభుత్వం దసరా కానుకగా ప్రజలకు శుభవార్త చెప్పింది. ఇన్నాళ్ల వస్తువులపై విధించిన జీఎస్టీ భారాన్ని తగ్గించాలని నిర్ణయించింది. ఈ నెల 22 నుంచి కొత్త జీఎస్టీ శ్లాబులు అమలు చేయనుంది. ఈ విషయాన్ని ఇటీవల పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. అధికంగా గృహోపకరణాలు, ఆటోమొబైల్స్, ఎలక్ట్రానిక్ పరికరాలు వంటి చాలా ఉత్పత్తు లపై 10శాతం మేర ధరలు తగ్గనున్నాయి. దీంతో వాహ నాలు, కార్లు, టీవీలు, సెల్‌ఫోన్లు తదితర వస్తువుల కొను గోలుదారులకు ఊరట లభించనుంది. గృహ నిర్మాణ దారులకు కూడా ఉపశమనం దక్కనుంది. వారం రోజుల నుంచి ఈ-కామర్స్ సంస్థలో సైతం అమ్మకాలు తగ్గుముఖం పట్టాయి. దీంతో సోమవారం నుంచి ప్రత్యేక ఆఫర్లతో వినియోగదారులను ఆకట్టుకునేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే అమేజాన్, గ్రేట్ ఇండియా ఫెస్టివల్, ఫ్లిప్‌కార్ట్ తదితర కంపెనీలు భారీ ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. అన్ని రకాల వస్తువులపై డిస్కౌంట్‌లు ఇవ్వనున్నాయి.

నిత్యావసర వస్తువులు తగ్గుముఖం..

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గనున్నాయి. ఉప్పు నుంచి పప్పు వరకు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో జీఎస్టీ సవరణలతో రెండు రోజుల్లో ఈ ధరలు దిగి రానున్నాయి. సాధారణ ప్రజలు నిత్యం వినియోగించే వస్తువులపై కేవలం ఐదు శాతం మాత్రమే జీఎస్టీ విధించారు. దీంతో పేస్ట్ నుంచి డ్రై ఫ్రూట్స్ వరకు ధరలు తగ్గనున్నాయి. వీటితోపాటు పన్నీర్, బ్రెడ్, వెన్న, నెయ్యి, పిస్తా, నూడిల్స్, బిస్కెట్లు, కేకులు, స్వీట్లు వంటివి అందుబాటు ధరల్లోకి రానున్నాయి. జీడిపప్పు, బాదం, ఖర్జూరం వంటి వాటిపై కూడా జీఎస్టీ 12శాతం నుంచి 5 శాతానికి తగ్గనుంది.

ఇళ్లు సులభమే..

జీఎస్టీ సంస్కరణలతో రియల్‌ఎస్టేట్ రంగానికి మంచి రోజులు కనిపిస్తున్నాయి. బిల్డర్లతోపాటు పేదలు కూడా సొంతిల్లు నిర్మించుకునేలా నిర్మాణ వ్యయం భారీగా తగ్గనుంది. దీంతో ప్లాట్లు, ఇళ్ల ధరలు తగ్గనున్నాయి. నిర్మాణ రంగంలో కీలకమైన సిమెంటు, ఇటుకలు, ఇసుక, గ్రానైట్, మార్బుల్స్, టైల్స్, రంగుల ధరపై కేంద్రం 4 నుంచి 6 శాతం వరకు జీఎస్టీ తగ్గించనుంది.

వాహనాల పైనా..



వాహనాలపై జీఎస్టీని 28 శాతం నుంచి 18 శాతానికి కేంద్రం కుదించింది. దీన్నితో వీటి ధరలు తగ్గనున్నాయి. సాధారణంగా దసరా, దీపావళి పండుగ రోజుల్లో కొత్తవాహనాలు కొనుగోలు చేయడం చాలామందికి సెంటిమెంట్. సోమవారం నుంచి జీఎస్టీ సవరణ అమలుతో ద్విచక్ర వాహనాలపై రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు తగ్గనుంది. కారుపై రూ.1.5లక్షల వరకు ధర తగ్గే అవకాశం ఉంది. దీంతో చాలా మంది ఈ నెల 22 తర్వాతే వాహనాలు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. కొన్ని షోరూమ్‌లు ప్రీబుకింగ్‌తోపాటు డిస్కౌంట్ ధరలు ప్రకటిస్తున్నాయి.



ఆరోగ్య బీమాపై జీరో..

ఆరోగ్య బీమా పాలసీలపై జీఎస్టీ 18శాతం ఉంది. దీనిపై ఎప్పటి నుంచో అన్ని వర్గాలు విమ్మలు వ్యక్తం చేస్తున్నారు. కేంద్రం సవరించిన శ్లాబుల్లో దీన్ని జీరో చేసింది. దీనిపై ప్రజల్లో హర్షం వ్యక్తం చేస్తున్నా.. ఆ ప్రతిఫలం కంపెనీలు ఏ మేరకు పాలసీదారులకు అందజేస్తాయో వేచిచూడాలి.

ఎలక్ట్రానిక్ వస్తువులపై..

ఎలక్ట్రానిక్ ఉపకరణాల ధరలు 10శాతం నుంచి 13 శాతం మేర తగ్గే అవకాశం ఉంది. టీవీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్‌మెషిన్లు, ఏసీలు.. ఇలా అన్ని రకాల వస్తువులు ధరలు తగ్గనున్నాయి. సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు కూడా అందుబాటు ధరలోకి రానున్నాయి. టీవీలపై రూ.5వేల నుంచి రూ.15వేల వరకు, ఫోన్లపై రూ.2వేల నుంచి రూ.5వేల వరకు, ఫ్రిజ్, వాషింగ్‌మెషిన్‌పై రూ.7వేల నుంచి రూ.10వేల వరకు తగ్గనున్నాయి. సాధారణంగా దసరా, దీపావళి సమయాల్లో ఎలక్ట్రానిక్ వస్తువులపై వ్యాపారులు ప్రత్యేక డిస్కౌంట్ ఇస్తారు. ఈసారి జీఎస్టీ సవరణ రూపంలో (మిగతా 8వ పేజీలో..)


నీలమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి అలంకరణ

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం నుంచి దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఉత్సవాలకు జిల్లాలో అమ్మవారు ఆలయాలన్నీ ముస్తాబయ్యాయి. శ్రీకాకుళంలోని ముత్యాలమ్మ తల్లి, నీలమ్మతల్లి, సంతోషిమాత, విజయదుర్గ, ఉమాదేవి, కాత్యాయని, లలిత త్రిపుర సుందరి, రాజరాజేశ్వరి, తుల్జాభవానీ తదితర ఆలయాలను సుందరంగా అలంకరించారు. అలాగే పట్టణాలు, గ్రామాల్లో ఎక్కడికక్కడ మండపాలు ఏర్పాటు చేశారు. సోమవారం దుర్గమ్మ విగ్రహాలను కొలువుదీర్చనున్నారు. అక్టోబరు 2 వరకు పూజలు, కుంకుమార్చనలు చేయనున్నారు.

పిల్లలపై ఓ కన్నేయండి

- నేటి నుంచి పాఠశాలలకు దసరా సెలవులు
- కాలక్షేపం మాటున అపాయాలు
- ఊహించని ప్రమాదాలతో మూల్యం
- తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాల్సిందే

నరసన్నపేట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సెలవులు అనగానే పిల్లలకు ఎక్కడ పట్టలేని ఆనందం వస్తుంది. ఆ సమయంలో కాలక్షేపం కోసం వారుచేసే పనులు ఒక్కోసారి ఊహించని ప్రమాదాలకు దారితీస్తుంటాయి. పాఠశాలలో అయితే నిత్యం ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ఉంటారు. పైగా తరగతులు, సిలబస్ వంటి వాటితో క్షణం తీరిక లేకుండా గడిపేస్తారు. వేసవి, దసరా, సంక్రాంతి సెలవులు అనేసరికి అధిక సమ యం ఖాళీగా దొరుకుతుంది. అప్పుడే పిల్లలు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతుంటారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో చోటుచేసుకున్న పరిణామాలు పిల్లల సంరక్షణపై మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. సోమవారం నుంచి పాఠశాలలకు ప్రభుత్వం దసరా సెలవులు కావడంతో పిల్లల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం.

- ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలో నదులు, కాలువలు, చెరువుల్లో నీరు పుష్కలంగా ఉంది. సాధారణంగా నీరు కనిపిస్తే పిల్లలకు ఈత కొట్టాలనిపిస్తోంది. గ్రామీణ ప్రాంత పిల్లలకు ఎక్కువగా ఈత వస్తుంది. చిన్నప్పటి నుంచి పట్టణాలు, హాస్టళ్లలో ఉండే (మిగతా 8వ పేజీలో..)

- ఈ ఏడాది మే 26న కంచిలి మండలం సామంతపుట్టుగలో గ్రామదేవత ఉత్సవాల్లో భాగంగా విద్యుత్ అలంకరణకు వినియోగించిన జీ వైరు(ఐరెన్ తీగ) తగిలి 12 సంవత్సరాల బాలిక బాడపల్లి నందిని మృతి చెందింది. ఆ బాలికను కాపాడే క్రమంలో చిల్ల ఈశ్వర్, మరో నాలుగేళ్ల బాలుడు నోళియా కృష్ణ కూడా మృతిచెందారు.

- ఈ ఏడాది మే 7న రణస్థలం మండలం అర్జునవలసలో పదో తరగతి చదువుతున్న వద్దాది గౌతమ్ రాజ్‌కుమార్ స్నేహితునితో కలిసి గ్రామ శివారులోగల బావికి స్నానం కోసం వెళ్లారు. స్నేహితుడు దుర్గాప్రసాద్ ఈత వచ్చా? అని అడగ్గా.. వచ్చుని చెప్పి బావిలో దిగిన కొద్ది సమయంలోనే గౌతమ్ నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయాడు. వేసవి సెలవులు కావడంతో నాన్నమ్మ సామాలమ్మ ఇంటికి తండ్రి లక్ష్మణరావుతో వచ్చి ప్రమాదవశాత్తు మృతిచెందాడు. ఒక్కగానొక్క కుమారుడి మృతితో ఆ తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం.


చెరువులో చిన్నారుల ఆటలు (ఫైల్)


కొండములగాంలో కొండపై కంకరను ట్రాక్టర్లలోకి లోడింగ్ చేస్తున్న దృశ్యం

కంకర దోపిడీ!

- కొండములగాం కొండపై యథేచ్ఛగా తవ్వకాలు
- శని, ఆదివారాల్లో మరింత అక్రమాలు
- పట్టించుకోని అధికారులు

రణస్థలం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): రణస్థలం మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న కొండములగాం కొండపై కంకర తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. శని, ఆదివారాలు వస్తే చాలు.. వందలాది ట్రాక్టర్లు, లారీల్లో కంకరను తరలించి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. అనుమతులు లేకుండా కంకర తరలించుకుపోతున్నా అధికారులు అడ్డుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కొండములగాం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్-2లో భారీ కొండ ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఓ నాయకుడికి ఈ కొండపై కంకర తవ్వకాలకు అనుమతులిచ్చారు. అప్పట్లోనే కొండపై భారీగా కంకరను తవ్వేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తవ్వకాలు నిలిపేశారు. అలాగే ఈ కొండకు సమీపాన ఆదర్శ పాఠశాల ఉండగా.. కంకర తవ్వకాలతో విద్యార్థులకు (మిగతా 8వ పేజీలో..)

ఐదుగురు గంజాయి స్మగ్లర్ల అరెస్టు
- మూడు వేర్వేరు కేసుల్లో 84.81 కిలోలు స్వాధీనం
- ఒడిశా నుంచి రవాణా చేస్తూ పట్టుబడిన వైనం
6లో

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు
- ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

'గురజాడ' దేశభక్తి గీతాన్ని ప్రచారం చేయాలి
7లో

ఆదిత్యుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి

వర్షానికి కూలిన పూరిల్లు
పిడుగుపాటుకు రెండేసి మేకలు, గొర్రెలు మృతి
6లో

డాబాపై నుంచి జారిపడి మహిళ మృతి

సంతబొమ్మాళి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): జగన్నాథపురంలో శనివారం రాత్రి డాబాపై నుంచి పడి కొమర ఎర్రమ్మ(46) మృతి చెందినట్టు ఎస్ఐ వై.సింహాచలం తెలిపారు. పై అంతస్తు నుంచి కింద అంతస్తుకు దిగుతుండగా జారి పడిపోవడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోటబొమ్మాళి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, ఎర్రమ్మ భర్త కొమర రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి..


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

హరిపురం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మందస మండలం కొర్రాయిగేటు వద్ద జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. కొర్రాయిగేటు సమీపం ప్రాంతాల్లో బిచ్చమెత్తుకొని జీవనం పొందుతున్న సుమారు 55ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు చికిత్స నిమిత్తం హరిపురం ఆసుపత్రికి తరలించగా.. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీలో భద్రపరిచామని, వివారాలు తెలిసినవారు మందస పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు..

లావేరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పాతకుంకాం గ్రామానికి చెందిన శటికం వెంకటరావు(64) శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్టు ఎస్ఐ జి.లక్ష్మణరావు తెలిపారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. వెంకటరావు కొన్నాళ్లగా కుటుంబంతో కలిసి విజయవాడలో నివసిస్తున్నాడు. భార్యతో గొడవపడి నాలుగు రోజుల కిందట స్వగ్రామం పాతకుంకాం వచ్చాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై ఇంటిలో వ్యవసాయం కోసం తెచ్చి దాచుకున్న గడ్డి మందు శనివారం తాగేశాడు. వాంతులు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం 108లో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య సుశీల, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

పిడుగుపాటుకు మేకలు, గొర్రెలు..


మృతి చెందిన గొర్రెలు, మేకలు

కంచిలి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని డోలగోవిందపురం గ్రామం వద్ద ఆదివారం సాయంత్రం పిడుగు పడిన ఘటనలో రెండు గొర్రెలు, రెండు మేకలు మృతి చెందాయి. ఈ మేరకు పశు వైద్యాధికారి శిరీష, బాధిత రైతు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బెల్లుపడ గ్రామానికి చెందిన గుర్రు రామారావు ఎప్పటిలాగానే ఆదివారం గొర్రెలు, మేకలను మేత కోసం డోలగోవిందపురం గ్రామం వైపు వెళ్లాడు. సాయంత్రం చిన్నపాటి వర్షం కురుస్తున్న సమయంలో పెద్ద శబ్దంతో గొర్రెలు, మేకలు మేస్తున్న సమీపంలో పిడుగు పడింది. దీంతో రెండేసి చొప్పున్న మేకలు, గొర్రెలు మృతి చెందాయి. సమాచారం తెలుసుకున్న పశు వైద్యాధికారి శిరీష ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

● ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు


నుజ్జునుజ్జయిన ద్విచక్ర వాహనం, కారు ముందు భాగం

నరసన్నపేట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై కోమర్తి పెట్రోల్ బంకు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నరసన్నపేట నుంచి శ్రీకాకుళం ద్విచక్ర వాహనంపై పోలాకి మండలం తలసముద్రం గ్రామానికి చెందిన పి.శ్రీను, సంతోష్ వెళ్తుండగా.. వీరి వెనుక నుంచి వస్తున్న కారు బలంగా ఢీకొని ముందు ఆగిఉన్న లారీ కిందకి ఈడ్చుకుంటూ వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న శ్రీను, వెనుక కూర్చున్న సంతోష్‌తోపాటు కారు డ్రైవ్ చేస్తున్న దుర్గారావు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108వాహనం, నేషనల్ హైవే అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. కారు కోటబొమ్మాళి మండలం కిష్టుపురం గ్రామానికి చెందిన వ్యక్తిదిగా గుర్తించామన్నారు.

సింగుపురంలో చైన్ స్నాచింగ్

శ్రీకాకుళం రూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సింగుపురం గ్రామం ప్రశాంతినగర్ కాలనీ సమీపంలో ఆదివారం చైన్‌స్నాచింగ్ కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కాలనీ సమీపంలోని చెరువు వద్ద ఉదయం 10 గంటల సమయంలో ధర్మవరం భోగమ్మ, భర్త లచ్చయ్య చెరువులో దుస్తులు ఉతుకుతుండగా అలసటగా ఉండడంతో ఆమె సమీపంలో ఉన్న నాటు బండిపై కూర్చొంది. ఈ సమయంలో గుర్తుతెలియని వ్యక్తి వచ్చి పక్కన కూర్చొని ఆమె మెడలో ఉన్న మూడు తులాల పుస్తెలతాడు తెంచి, అప్పటికే ద్విచక్ర వాహనంతో సిద్ధంగా ఉన్న వ్యక్తితో పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

వర్షానికి కూలిన పూరిల్లు


కూలిపోయిన మట్టి గోడ

మెళియాపుట్టి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి నందవ గ్రామం సవర చిన్న లక్ష్మయ్యకు చెందిన పూరింటి గోడ కూలిపోయింది. గతకొద్ది రోజులుగా కురిసిన వర్షానికి ఈ మట్టి గోడ నానిపోవడంతో ఆదివారం కురిసిన చిన్నపాటి వర్షానికి కూలిపోయింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని జనసేన పార్టీ నాయకులు రామ్మూర్తి, కిరణ్‌కుమార్ కోరారు. ఈ విషయం ఎమ్మెల్యే గోవిందరావు దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిపారు.

లో వోల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు

కాశీబుగ్గ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పలాస మునిసిపాలిటీ పరిధిలో గల 3వ వార్డు శివాజీనగర్ కాలనీ వాసులు లోవోల్టేజ్ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని ఆ వార్డు టీడీపీ ఇన్‌చార్జి కొండే నర్సింహులు యాదవ్ ఎమ్మెల్యే గౌతు శిరీష దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశంతో ఆదివారం ట్రాన్స్‌కో అధికారులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో నరసింహులు సొంత నిధులు వెచ్చించి ట్రాన్స్‌ఫార్మర్‌కు అవసరమైన దిమ్మను ఏర్పాటు చేయించారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవ్వండి

● పలాస నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త వెంకన్నచౌదరి


సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న వెంకన్నచౌదరి

పలాస, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని పలాస నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త వెంకన్నచౌదరి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి నాయకులు, కార్యకర్తలు, పార్టీ మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, క్లస్టర్ కన్వీనర్లు, కో కన్వీనర్లు, యూనిట్ కన్వీనర్లు, కో కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే అన్నీ పంచాయతీలు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, మునిసిపాలిటీలోని వార్డులు గెలుపొందేందుకు ఇప్పటి నుంచే అవసరమైన ప్రణాళికలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలంతా కూటమి ప్రభుత్వం వైపే ఉన్నారని, ఉచిత బస్సు వల్ల మహిళలంతా సంతోషంగా ఉన్నారన్నారు. వైసీపీ చేయలేనిది కూటమి ప్రభుత్వం చేసి చూపించిందని వివరించాలన్నారు. కూటమి నాయకులతో సర్దుబాటు చేసుకొని గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించాలని, ఎన్నికలే ప్రధాన అజెండాగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరావు యాదవ్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాస్, బడ్డ నాగరాజు, ఎం.నరేంద్ర, టంకాల రవిశంకర్‌గుప్తా, సూరాడ మోహనరావు, గురిటి సూర్యనారాయణ, వంకల కూర్మారావు, కిక్కర ఢిల్లీరావు పాల్గొన్నారు.

ఐదుగురు గంజాయి స్మగ్లర్ల అరెస్టు

● మూడు వేర్వేరు కేసుల్లో 84.81 కిలోలు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న సీఐ సూర్యనారాయణ

పలాస, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి మూడు వేర్వేరు కేసుల్లో ఐదుగురు గంజాయి స్మగ్లర్లను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 84.81 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ ఆదివారం విలేకరులకు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం రాయఘడ జిల్లా గోయిబంద గ్రామానికి చెందిన గంట జైశ్వా, అదే జిల్లా సర్గిగూడ గ్రామానికి చెందిన స్వప్న బిబ్హార్ సహజీవనం చేస్తున్నారు. బిబ్హార్‌కి కోడలి వరుస అయిన రింకు బిబ్హార్ గంజాయి పండిస్తూ మహారాష్ట్రలోని షోలాపూర్ ప్రాంతంలో అమ్ముతుంటుంది. ఆమె ఆరోగ్య పరిస్థితి బాగోలేకపోవడంతో స్వప్న, జైశ్వాలకు గంజాయి తీసుకొని వెళ్లి షోలాపూర్‌లో ఉంటున్న మోహన్ రోహిదాస్‌కు ఇవ్వాలని కోరింది. దీంతో 40.24 కిలోలు గంజాయి ప్యాకెట్లు చేసి వారికి అప్పగించింది. దీన్ని తరలించేందుకు రూ.20వేలు ఇస్తామని చెప్పడంతో వారు గంజాయిని గుణుపూర్ నుంచి పలాస వరకూ బస్సులో వచ్చి.. అక్కడి నుంచి పలాస రైల్వే స్టేషన్‌కు వస్తుండగా తనిఖీలు చేస్తున్న ఎస్ఐ ఆర్.నర్సింహమూర్తికి తారాసపడ్డారు. బ్యాగులు పరిశీలించగా గంజాయి బయట పడింది. దీంతో వారిద్దర్నీ అరెస్టు చేసి మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు.

● అదేవిధంగా తమిళనాడు రాష్ట్రం విజయరాఘవపురం, చెన్నైకు చెందిన గాయత్రి అనీఫ్, సుభాష్ అన్నాచెల్లెలు. ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడికి చెందిన మమతాకుమారి గంజాయి పండిస్తూ బ్రోకర్ల ద్వారా ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తుంది. మగవారు గంజాయి తరలిస్తుంటే మన రాష్ట్రంలో నిరంతరం నిఘా ఉండడంతో ఆడవారితో గంజాయి రవాణాకు పథకం రచించారు. ఈ క్రమంలో అన్నా చెల్లెలు కలసి 28.86 కిలోల గంజాయిని చెన్నై తరలించేందుకు పర్లాకిమిడి నుంచి పలాస వెళ్లే బస్సులో వచ్చారు. శనివారం రాత్రి పలాస రైల్వేస్టేషన్‌కు గంజాయితో వస్తుండగా కాశీబుగ్గ ఎస్ఐ నర్సింహమూర్తికి వచ్చిన సమాచారం మేరకు ఇద్దర్నీ ప్రశ్నించడంతో గంజాయి బ్యాగులు బయటపడ్డాయి. వీరిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీరిని మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు.

● ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా కాంతాసురు గ్రామానికి చెందిన లలితమాఝి అనే మహిళ 15.71 కిలోల గంజాయి తరలిస్తు కాశీబుగ్గ ఎస్ఐ ఆర్.నర్సింహమూర్తికి శనివారం అర్ధరాత్రి పలాస రైల్వేస్టేషన్ రోడ్డులో పట్టుబడింది. కేంఝోర్‌కు చెందిన సంజయ్‌కుమార్‌కు బెంగుళూరుకు చెందిన హేనాబేగం పరిచయం అయింది. వీరిద్దరు గతంలో ఒడిశా నుంచి గంజాయి తీసుకువెళ్లి ఆ ప్రాంతంలో అమ్మకాలు చేసేవారు. మహిళయితే ఎటువంటి అనుమానాలు లేకుండా గంజాయి సులభంగా తీసుకురావచ్చనే అత్యాసతో లలితమాఝికి ఉసుగొలిపి గంజాయి ఇచ్చి పంపించారు. ఈ క్రమంలో పోలీసుల తనిఖీల్లో ఆమె పట్టుబడింది. మొత్తం మూడు కేసుల్లో సంబంధించి ఐదురుగురిని అరెస్టు చేశామని సీఐ తెలిపారు.

అర్హతే ప్రాతిపదికగా సాయం: ఎంజీఆర్



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం/హిరమండలం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): అర్హతే ప్రాతిపదికగా ప్రభుత్వం సాయం అందిస్తుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు (ఎంజీఆర్) అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం హిరమండలం మండలం సబలయి కాలనీకి చెందిన ఆర్థిత రోహిత్ అనే బాలుడుకి సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.1,60,502 చెక్కును అందజేశారు. ఆర్థిత రోహిత్ కొన్నాళ్లగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం జడ్పీటీసీ పి.బుచ్చిబాబు సాయంతో ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేయించి సాయాన్ని మంజూరు చేయించారు. కార్యక్రమంలో లబ్ధిదారు కుటుంబ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందిలేకుండా పనులు చేపట్టాలి


కాశీబుగ్గ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ రైల్వే ఫ్లై ఓవర్ పనులు చేసేటప్పుడు ప్రజలకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని పలాస నియో టజకవర్గం టీడీపీ సమన్వయకర్త వెంకన్న చౌదిరి అన్నారు. కాశీబుగ్గ రైల్వే గేటు నుంచి మూడు రోడ్ల జంక్షన్ వరకు ఫ్లై ఓవర్ నిర్మాణం కోసం గత మూడు రోజులుగా దుకాణాలు తొలగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. గతంలో కాశీబుగ్గ రైల్వేగేట్ దాటాలంటే ఇబ్బంది పడేవారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే గౌతు శిరీష శ్రమించి యుద్ధప్రాతిపదికన పనులు జరిగేలా చూస్తున్నారన్నారు. ముఖ్యంగా ఫ్లై ఓవర్ నిర్మాణానికి కృషి చేసిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, ఏఎంసీ చైర్మన్ ఎం.శ్రీనివాస్‌రావు, పీరుకట్ల విఠల్‌రావు, సీనియర్ కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్, గాలి కృష్ణారావు, నరేంద్ర(చిన్ని), సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా రమణారావు


నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

పాతపట్నం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడుగా శ్రీరామ్ రమణారావు ఎన్నికయ్యాడు. స్థానిక గిరిజన సామాజిక భవనంలో అసోసియేషన్ జిల్లా కార్యవర్గ ఎంపిక ఆదివారం జరిగింది. నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా శ్రీరామ్ రమణారావు, ఉపాధ్యక్షుడిగా గురాడి అప్పన్న కార్యదర్శిగా జైనవలస షన్ముఖరావు, సహాయ క్యాదర్శిగా ఎన్ని దిలీప్‌కుమార్, కోశాధికారిగా జమ్ము లోకేశ్వరరావు, గేమ్ అడ్వైజర్‌గా మాణిక్యాలరావు ఎన్నికైనట్టు నూతన అధ్యక్షుడు తెలిపారు. పీడీ ఎన్ని శేఖర్‌బాబు పర్యవేక్షణలో జరిగిన ఈ ఎన్నికలో పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల అభివృద్ధికి చర్యలు



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

టెక్కలి రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాలు అభివృద్ధికి చర్యలు తీసు కుంటున్నట్టు కార్యదర్శి నిర్మల తెలిపారు. ఆదివారం మేఘవరం పంచాయతీలో ఆదికర్మ యోగి కార్యక్రమంలో భాగంగా చేపట్టనున్న అభివృద్ధిపై ర్యాలీ చేపట్టారు. కార్యక్రమలో వీఆర్వో శ్యామ్, తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన చిన్నారులు

పాతపట్నం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఈనెల 19వ తేదీన పలాసలో జరిగిన జిల్లాస్థాయి రోలర్ స్కేటింగ్ అండర్-11 విభాగంలో ఎల్.శాన్వి శీతల్, 14 విభాగం నుంచి కొర్రాయి సాయి వర్షిత, సైలాపు కృష్ణచైతన్య రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పీడీ వై.శేఖర్‌బాబు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు సీనియర్ వ్యాయమ ఉపాధ్యాయులు ఎస్.కృష్ణ, జె.కృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

సమస్యలు పరిష్కరించాలి

నరసన్నపేట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కారం అయ్యేవరకు రాజీలేని పోరాటం చేస్తామని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సంఘ నాయకులు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి అన్నారు. ఆదివారం స్థానిక ప్రాజెక్టు కార్యాలయ ఆవరణలో సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షులుగా సరోజని, ఉపాధ్యక్షులుగా ఎం.పుణ్యవతి, సులోచన, ప్రధాన కార్యదర్శి పి.భాగ్యలక్ష్మి, సహాయ కార్యదర్శులుగా కె.లలిత, సుశీల, అమ్ముడమ్మ, కోశాదికారిగా అమరావతి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు చలపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయాలి


ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

కొత్తూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'స్వస్థ్ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్' పథకం వరంలా నిలుస్తుందని కొత్తూరు సీహెచ్‌సీ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ లీలాకుమార్ అన్నారు. ఆదివారం సీహెచ్‌సీలో ఎస్ఎన్ఎస్‌పీఏ కార్యక్రమం నిర్వహించి అనంతరం సిబ్బంది ప్రజలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా మహిళలు, బాలికల వారి కుటంబాలు ఆరోగ్యాన్ని మెరుగు పరచడం వీలు పడుతుందన్నారు. ప్రాథమిక ఆరోగ్య సేవలు, పోషణ, ఆరోగ్య పరిరక్షణ, క్యాన్సర్ స్కీనింగ్ వంటి సదుపాయాలు ప్రజలకు చేరువ అయ్యేందుకు ఈ పథకం ఉపకరిస్తుందని తెలిపారు. అనంతరం వైద్యులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైద్యులు సురేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

కషాయం తయారీపై రైతులకు శిక్షణ

కొత్తూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): కూరగాయ పంటలకు వచ్చే చీడపీడల నివారణకు బ్రహ్మాస్త్ర కషాయం అత్యంత ఉపయోగ పడనుందని, వాణిజ్య పంటల రైతులు కషాయ తయారీతో ఖర్చులు తగ్గించుకోవచ్చని ప్రకృతి వ్యవసాయం కొత్తూరు యూనిట్ అధికారి రవికుమార్ రైతులకు సూచించారు. ఆదివారం కొత్తూరు మండలం గూనబద్రలో కషాయం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు అందుబాటులో ఉన్న వేపాకులు, పచ్చిమిర్చి, వెల్లుల్లి, పొగాకు కాడలు కావల్సినంత ఉపయోగించి వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసియార్ ముఖలింగం, గిరి, మహేష్, డిల్లేశ్వరి పలువురు రైతులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ


గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటేష్

హిరమండలం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ చేకూరుతుందని ఎస్ఐ వెంకటేష్ అన్నారు. ఆదివారం మండలంలోని చిన్నకోరాడలో నారీశక్తి మహిళలకు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. సామాజిక మధ్యమాల ద్వారా జరుగుతున్న వేధింపులు, సైబర్ మోసాల గురుంచి వివరించారు. చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలన్నారు. వేధింపులకు గురైతే వంటనే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని చెప్పారు.

రోడ్డుపై గోతులు... తప్పని ఇబ్బందులు



వజ్రపుకొత్తూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి బెండి గ్రామం వరకు గల ఆర్ అండ్‌బీ రోడ్డు గోతులు ఏర్పడడంతో రాకపోకలకు వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందిపడుతున్నారు. చిన్నపాటి వర్షానికే గోతుల్లో నీరు చేరి ప్రమాదకరంగా మారుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో రోడ్డు విస్తరణ పేరుతో కనీసం మరమ్మతులు కూడా చేపట్టకుండా మధ్యలోనే వదిలేశారని, అప్పటి నుంచి ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా హైస్కూల్ వద్ద గల్లి గ్రామం వద్ద రోడ్డుపై గుంతలు అధికంగా ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నరసన్నపేట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉర్లాం 33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపట్టనుండడంతో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ నర్సింహకుమార్, ఏఈ బాలకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో ఉర్లాం, నడగాం, సుందరాపురం, చోడవరం, వీఎన్ పురం, బాలసీమ తదితర గ్రామాలకు మంగళవారం ఉదయం 7 గంటలు నుంచి మధ్యాహ్నం 2గంటలు వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

● కవిటి: బొరివంక సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ జి.యజ్ఞేశ్వరరావు తెలిపారు. విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో మంగళవారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు. మాణిక్యపురం, కుసుంపురం, బల్లిపుట్టుగ, బొరివంక, దూగానపుట్టుగ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ ఉండదన్నారు.

ఎరువుల కోసం వివాదం

శ్రీకాకుళం రూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): బైరి గ్రామంలో ఎరువుల పంపిణీ సందర్భంగా దుకాణదారు, రైతుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. బాలాజీ ట్రేడర్స్ ఎరువుల దుకాణదారు ముద్దాడ శ్యాంసుందరరావు, తండ్రి ఈశ్వరరావు ఆదివారం ఉదయం 6.30 గంటల సమయంలో యూరియా పంపిణీ చేస్తున్నారు. ఆ సమయంలో రైతులు పాతిన అప్పలసూరి తదితరులు లైన్‌లో ఉండకుండా ముందుకు వచ్చి వ్యాపారితో వాగ్వాదానికి దిగారు. రైతులు షాపులోకి అక్రమంగా ప్రవేశించి, దాడి చేసి తన తండ్రిని కొట్టారని, షర్టు చింపి షాపులోని రూ.55 వేలు అపహరించారని దుకాణదారు శ్యాంసుందరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా యూరియా ఇవ్వడానికి వ్యాపారి నిరాకరించాడని, గ్రామపెద్ద లేకుంటే అగ్రికల్చర్ అధికారి సిఫారసు లేఖ తేవాలని పేర్కొంటూ ఆధార్ కార్డులను విసిరివేశాడని, చొక్కాలు చించి బయటకు నెట్టివేశారని బాధిత రైతులు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆధార్ సేవలు అందక అవస్థలు


మూలకు చేరిన కంప్యూటర్, పరికరాలు

హిరమండలం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ సచివాలయాలతో పాటు స్థానిక పోస్టాఫీస్‌లో ఆధార్ సేవలు నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సామాజిక పింఛన్లు, రైతు సేవా కేంద్రాల్లో పంటల బీమా, అన్నదాత సుఖీభవ, బ్యాంకు లావాదేవీలు, భూముల రిజిస్ట్రేషన్, విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి సేవలకు ఆధార్ కీలకంగా మారింది. ఆధార్ ఉన్న ప్రతి ఒక్కరూ కార్డులో మార్పులు, చేర్పులు, వేలిముద్రల అప్‌డేట్ వంటి సేవల కోసం ఈ కేంద్రాలు అవసరం. ఇటీవల సచివాలయ సిబ్బంది బదీలు కారణంగా ఆధార్ సేవలు నిలిచిపోయాయి. అలాగే పోస్టాఫీసులో కంప్యూటర్ డివైజ్‌లు పనిచేయక ఆధార్ సేవలు నిలిచిపోయాయి. దీంతో మండలంలోని ప్రజలు ఆధార్ సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామ సచివాలయాల్లోనూ, హిరమండలం పోస్టాఫీస్‌లో సేవలను పునరుద్ధరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

యువత రక్తదానం

సంతబొమ్మాళి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): వివిధ సేవా కార్యక్రమాల్లో భాగంగా సంతబొమ్మాళి యువత రక్తదానం చేశారు. యువజన సేవా సంఘం పదో వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 20 మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా యువకేంద్రం డిప్యూటీ డైరెక్టర్ వెంకట్ ఉజ్వల్, పీఏసీఎస్ చైర్మన్ కూచెట్టి కాంతారావు, మాజీ సర్పంచ్ మెండ అప్పారావు, యువజన సంఘ ప్రతినిధులు కూచెట్టి భానుప్రకాష్, అట్టాడ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురజాడ జయంతి

కొత్తూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజా కవి గురజాడ అప్పారావు జయంతి ఆదివారం కొత్తూరులో రచయతలు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా వేడులకు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు కలమట శ్రీరాములు మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన రచినలు, నాటక ప్రదర్శనలతో పాలకుల దృష్టికి తెచ్చి పరిష్కారం అయ్యేలా కృషి చేసిన గురుజాడ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. అనంతరం గురజా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళాలర్పించారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుతులు అందజేశారు. కార్యక్రమంలో కామేశ్వరి, ఉషారాణి, దిలీప్ పట్నాయక్, బి.రమణమూర్తి, రచయతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● మెళియాపుట్టి: స్థానిక గ్రంథాలయంలో ఆదివారం మహాకవి గురజాడ అప్పారావు జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అనురాధ, మురళి పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

టెక్కలి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక పోస్టు మెట్రిక్ బీసీ బాలికల వసతిగృహంలో ఆదివారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. గైనకాలజీ విభాగానికి చెందిన డాక్టర్ అరవింద్, డాక్టర్ ధనలక్ష్మి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. అలాగే విద్యార్థులకు అవసరమైన శానిటరీ సామగ్రి అందజేశారు. మహిళల హెల్త్‌ఎడ్యుకేషన్‌పై సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎన్‌జీవో సభ్యులతో పాటు వసతిగృహ సంక్షేమాధికారి శ్రావణి, కుమారి, రిటైర్డు డిప్యూటీ డీఈవో డాక్టర్ కీర్తి, జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు చేపట్టాలి

హరిపురం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మందస మండలం సొండిపూడి గ్రామంలోని ఎస్సీ కాలనీ శ్మశానవాటికలో మరమ్మతు పనులు చేయాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు. ఆదివారం ఆ గ్రామ యువత శ్రమదానం చేపట్టి పిచ్చి మొక్కలు తొలగించారు. సునాముది కాలువ పక్కనే శ్మశానవాటిక ఉండడంతో కోతకు గురవుతుందన్నారు. అందువల్ల ప్రహరీ నిర్మించి, అవసరమైన అభివృద్ధి పనులు చేయాలని కోరారు.

ఆదిత్యుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి



హైకోర్టు న్యాయమూర్తికి జ్ఞాపికను అందిస్తున్న ఈవో

అరసవల్లి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డి సత్తి ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా, అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామి వారి ప్రసాదం, జ్ఞాపికను ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా, అర్చకులు ఇప్పిలి సాందీప శర్మ, రామకృష్ణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుడి ఆదాయం రూ.2.26 లక్షలు

అరసవల్లి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): అరసవల్లి సూర్యనారాయణ స్వామికి ఆదివారం రూ.2,26,871 ఆదాయం లభించింది. ఆదివారం పోలేల అమావాస్య కావడంతో సాధారణ స్థాయిలోనే భక్తులు వచ్చారు. దీంతో క్యూలైన్లు ఖాళీగా కనిపించాయి. ఆదివారం టిక్కెట్ల ద్వారా రూ.55,000, విరాళాలు రూ.42,906, ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.1,28,965 వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

సకాలంలో ఆర్థిక ప్రయోజనాలను చెల్లించండి

గుజరాతీపేట. సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు సకాలంలో ఆర్థిక ప్రయోజనాలను చెల్లించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణ కోరారు. స్థానిక క్రాంతిభవన్‌లో ఆదివారం ఎస్టీయూ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలైనా ఉద్యోగ సంఘాలతో ఇంతవరకు సమావేశం జరగలేదని, రెండేళ్ల డీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దసరాకు ఒక డీఏ చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి అక్టోబరు 7న ఫ్యాప్టో తలపెట్టిన విజయవాడ ధర్నా కరపత్రాన్ని ఆవిష్కరించారు. సమా వేశంలో సంఘం జిల్లా ప్రతినిధులు పి.రామకృష్ణ, సీహెచ్ రామారావు, బి.ఇందిర తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండి నేర ప్రవృత్తికి స్వస్తి పలికి సత్ప్రవర్తనతో మెలగాలని రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు అన్నారు. ఆదివారం శ్రీకాకుళం ఒకటి, రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆదేశాలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రజా సమస్యలపైనే ఛాయారాజ్ కవిత్వం



మాట్లాడుతున్న రచయిత హస్సేన్

శ్రీకాకుళం కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలే వస్తువుగా ఛాయారాజ్ రచనలు చేశారని ఒంగోలుకు చెందిన ప్రముఖ కవి సయ్యద్ సాబీర్ హుస్సేన్ అన్నారు. ఉపాధ్యాయుడు, రచయిత కొంక్యాన ఛాయారాజ్ 13వ వర్థంతిని స్థానిక కేంద్ర గ్రంథా లయంలో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఛాయారాజ్ కవిత్వం కవిత్వం కోసం కాకుండా ప్రజా సమస్యలు, పోరాటాలపై రాసి కీర్తి సంపాదించారన్నారు. ఆయన రచనలు సాహిత్యోద్యమాలకు స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ.. ఛాయారాజ్ మట్టితో, మనుషులతో ఆత్మీయంగా ఉండే వారని.. ఆ విధంగానే సాహిత్యం కూడా ఉండేదన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నేత కె.భానుమూర్తి, ఎస్.శంకరరావు, ఆర్.శ్రీనివాసరావు, చావలి శ్రీనివాస్, తిరుమలరావు, సనపల నారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనపై అవగాహన ర్యాలీ



రక్తదానం చేస్తున్న గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు

అరసవల్లి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా నగరంలో అవినీతి నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో 45 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ సుధాకర్ మాట్లాడుతూ.. గ్రామీణ బ్యాంకు సిబ్బంది రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ ఎల్.అనంతరావు, లీడ్ బ్యాంకు మేనేజర్ పేడాడ శ్రీనివాసరావు, విజిలెన్స్ అధికారి రమేష్ రెడ్డి, సీనియర్ మేనేజర్ నందిని సాహు, రెడ్‌క్రాస్ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

రణస్థలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జేఆర్‌పురం జడ్పీ హైస్కూల్లో 1999-2000లో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం నిర్వహించారు. వారంతా నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని నేటి పరిస్థితులను తెలుపుకుంటూ ఆనందం పొందారు. నాటి ఉపాధ్యాయులను సత్కరించి వారి ఆశీస్సులు స్వీకరించారు.

జిల్లేడు ద్రావణంతో చీడపీడల నివారణ

సరుబుజ్జిలి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పంటల్లో జిల్లేడు ద్రావణం వేయడం వల్ల చీడపీడలను నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయం టీమ్ ఎంటీ సూర్యనారాయణ అన్నారు. రొట్టవలస గ్రామంలో జిల్లేడు ద్రావణం తయారీపై ఆదివారం రైతులకు అవగాహన కల్పించారు. రైతులు తక్కువ పెట్టుబడితో లభించే ద్రావణాలు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో డీఎం ఎంటీ సురేష్, ఐసీఆర్‌పిలు తిరుపతిరావు, సుమమ తదితరులు పాల్గొన్నారు.

దసరా సంబరాలకు ఏర్పాట్లు

- విద్యుత్ అలంకరణలతో ఆలయాలు, మందిరాలు శోభాయమానం

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం నుంచి ఈ ఉత్సవాలు నిర్వహణకుగాను నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఆలయాలు, మందిరాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. వివిధ మండపాల్లో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దీపారాధన కోసం ప్రత్యేక మండపాన్ని సిద్ధం చేశారు. సోమవారం వేకువ జామునుండే పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గాంధీ పార్క్ వద్ద ముత్యాలమ్మ, ముత్యాలమ్మపేట వద్ద ముత్యాలమ్మ, డబ్బూరి వీధి జంక్షన్ వద్ద కలకత్తా కాళీమాత ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు 10 రోజుల పాటు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అలాగే సంతపేట జంక్షన్ వద్ద వెలసిన నూకాలమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో దేవీ శరన్నరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నామని ఆలయ ధర్మకర్తలు కాళ్ల శ్రీనివాసరావు, లక్ష్మి తెలిపారు. సోమవారం నుంచి అక్టోబరు ఒకటో తేదీ వరకు అమ్మ వారు వివిధ అవతారాల్లో దర్శనమిస్తారన్నారు.



విద్యుత్ దీపాల వెలుగులో స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయం



పురుషోత్తపురంలో సిద్ధం చేసిన అమ్మవారి మండపం

పురుషోత్తపురంలో..

సరుబుజ్జిలి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పురుషోత్తపురంలో సోమవారం నుంచి నిర్వహించనున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు కమిటీ సభ్యులు సర్వం సిద్ధం చేశారు. విద్యుత్ అలంకరణలు, పచ్చని తోరణాలతో మందిరాన్ని తీర్చిదిద్దారు. అమ్మవారి గుడి ఆకారంలో బంగారుఛాయలో ఉన్న సెట్ ఆకట్టుకుంటోంది. ప్రతిరోజూ కుంకుమ పూజలు, హోమాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

కొండచిలువ హతం



హతమైన కొండచిలువ

కంచిలి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దాకరాపల్లిలో ఆదివారం సాయంత్రం సుమారు 10 అడుగుల కొండచిలువ హల్‌చల్ చేసింది. గ్రామంలోని మేకల పాకలోకి కొండ చిలువ ప్రవేశించింది. దీనిని గమనించిన స్థానికులు కర్రలతో కొట్టి చంపారు.

గాయపడిన విద్యార్థినికి పరామర్శ

పొందూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): లోలుగు కేజీబీవీలో మేడపైనుంచి దూకడంతో తీవ్ర గాయాల పాలైన ఇంటర్ విద్యార్థిని వందనను పొందూరు టీడీపీ మండల నాయకులు ఆదివారం ఆసుపత్రిలో పరామర్శించారు. ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. పరామర్శించిన వారిలో టీడీపీ నేతలు సీహెచ్ రామ్మోహన్, ఎ.రాము, బలగ శంకర భాస్కర్, బాడాన గిరి, ఎంపీటీసీలు బి.హారిక, ఎ.వాణి తదితరులున్నారు.

అర్ధంతరంగా నిలిచిన పనులు



అసంపూర్తిగా విడిచి పెట్టిన కాలువ పనులు

కవిటి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): కవిటి ప్రభుత్వ ఆసుపత్రి ఎదురువీధిలో కాలువ నిర్మాణం పనులు నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలుగునెలల కిందట ప్రారంభించిన పనులు పూర్తి కాకపోవడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా ఉందని పేర్కొంటున్నారు. గోతులు తవ్వి రెండునెలలు పాటు విడిచిపెట్టారు. ఈవిషయాన్ని 'ఆంధ్రజ్యోతి' లో కథనం రావడంతో పనులు ప్రారంభించారు. ఆ తరువాత గతనెలలో కొంతమేర పనులు చేపట్టి తిరిగి విడిచిపెట్టారు. దీంతో రాజపురం రోడ్డు మలుపులో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా పనులు పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.

'గురజాడ' దేశభక్తి గీతాన్ని ప్రచారం చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సాహితీ స్రవంతి ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రస్తుతం నెలకొన్న విద్వేషపూరిత వాతావరణంలో మతాలు, కులాల మధ్య ఐక్యతను పెంపొందించాల్సిన అవసరం ఉందని, దీనికోసం గురజాడ రచించిన దేశభక్తి గీతాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని సాహితీ స్రవంతి అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు అన్నారు. మహాకవి గురజాడ అప్పారావు 163వ జయంతి సందర్భంగా ఆదివారం డే అండ్ నైట్ కూడలి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్, అంబేడ్కర్ జంక్షన్, కోడిరామ్మూర్తి స్టేడియం మీదుగా ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్ వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు గొంటి గిరిధర్, ఎస్ఎఫ్ఐ నాయకురాలు పి.పవిత్ర, బాడాన శ్యామలరావు, కంచరాన భుజంగరావు, డాక్టర్ కె.ఉదయ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వెలుగుజాడ.. గురజాడ

సమాజ జాగృతికి వెలుగుజాడ గురజాడ అని పలువురు వక్తలు అన్నారు. సంఘ సంస్కర్త, నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు జయంతిని ఆదివారం స్థానిక గాంధీ స్మారక మందిరం స్మృతివనంలో మందిర కమిటీ, తెలుగు రచయితల వేదిక (తెరవే) ఆధ్వర్యంలో వేర్వేరుగా నిర్వహించారు. గురజాడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. కన్యాశుల్కం, పుత్తడిబొమ్మ పూర్ణమ్మ తదితర రచనలు నాటినుంచి నేటి వరకు సమాజంలో నెలకొన్న స్థితిగతులకు అద్దం పడుతున్నాయన్నారు. 'దేశమంటే మట్టికాదోయ్.. దేశమంటే మనుషులోయ్' అని చాటి చెప్పిన గురజాడ స్ఫూర్తి ఎప్పటికీ సజీవంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ అవధాని పైడి హరనాథరావు గురజాడను కీర్తిస్తూ గీతాన్ని ఆలపించారు. ప్రసిద్ధ రచయిత పత్తి సుమతి రచించిన అగ్నిఖడ్గం పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో మందిరం ప్రతినిధులు వావిలపల్లి జగన్నాథంనాయుడు, ప్రొఫెసర్ విష్ణుమూర్తి, కొమ్ము రమణ మూర్తి, జామి భీమశంకరరావు, ఎంవీ వీఎస్ శాస్త్రి, తెరవే ప్రతినిధులు యు.నాగేశ్వరరావు, ఆర్వీ రమణ మూర్తి, నిక్కు అప్పన్న, బారువ కోమలరావు, ముట్నూరు ఉపేంద్ర శర్మ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో వంశధార కుడి కాలువ పనులు: ఎమ్మెల్యే శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

గార రూరల్/అరసవల్లి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వంశధార కుడి కాలువ చివరి డిస్ట్రిబ్యూ టరీ 37 టీఈకి మహర్దశ పట్టనుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఈమేరకు ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఆయకట్టు రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కాలువ ద్వారా మండల పరిధిలోని సుమారు 11 గ్రామాల ఆయకట్టుకు సాగు నీరందుతుందన్నారు. కాంగ్రెస్ హయాంలో 2006లో కాలువ పనులు చేపట్టారని, అయితే వివిధ సాంకేతిక సమస్యలతో 2009లో అర్ధంతరంగా నిలిపివేశారన్నారు. అప్పటి నుంచి వర్షాధారం పైనే రైతులు ఆధారపడ్డారని తెలిపారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొం టున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లగా ఈనెల 18న అసెంబ్లీ సమావేశాల్లో ప్రశ్నోత్తరాల సమయంలో ప్రస్తావించి జలవనరుల శాఖామంత్రి రామానాయుడు దృష్టికి తీసుకువెళ్లామన్నారు. పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్టును రద్దు చేసి సుమోటో ఈఓటి ప్రాతిపదికన కొత్త కాంట్రాక్టు ఏజెన్సీకి అప్పగించాలని కోరా మన్నారు. దీనికి సంబంధిత మంత్రి స్పందించి తగు ఉత్తర్వులిచ్చారన్నారు. త్వరలో జల్లపేట మొదలు శివారు ప్రాంతమైన వత్స వలస పంచాయతీ ఆమదాలపాడు వరకు 37 టీఈ కుడి కాలువ అభివృద్ధి పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు. సాగునీటి కాలువ పనులు చేపట్టేందుకు ఎమ్మెల్యే చొరవ చూపడంపై ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



అంగన్‌వాడీ కేంద్రం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ అల్లుకున్న పిచ్చి మొక్కలు

సోంపేట రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎకువూరు ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం పక్కన 11 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. దీనికి పిచ్చిమొక్కలు పెరిగి ప్రమాదకంగా తయారైంది. అంగన్‌వాడీ కేంద్రంలో 16 మంది పిల్లలున్నారు. వీరు ఆరుబయట ఆడుకునే సమయంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా పోలాల అమావాస్య పూజలు



బెజ్జిపుట్టుగలో పూజలు చేస్తున్న మహిళలు

కవిటి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పోలాల అమావాస్య సందర్భంగా పలు గ్రామాల్లో ఆదివారం మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. బెజ్జిపుట్టుగలోని ఆలయంలో మహిళలు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

అరసవల్లి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పోరాటాలతోనే సమస్యల పరిష్కారానికి మార్గం లభిస్తుందని, దీనికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం నేతలు అన్నారు. సంఘం 12వ మహాసభలు స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. గ్రూప్-సి అధ్యక్షుడు యూవీ రమణ, ఎంటీఎస్ అధ్య క్షుడు టి.వేంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన కార్య క్రమంలో ఎన్ఎఫ్‌పీఈ రాష్ట్ర కన్వీనర్ బి.శ్రీధర్ బాబు, ఎంటీఎస్ రాష్ట్ర కార్యదర్శి కె.మురళీ మాట్లాడుతూ.. తపాలా శాఖలో నేడు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు చేయాలన్నారు. కార్మిక హక్కులను కాలరాసే లేబర్ కోడ్లను ఎదిరించాలని, 8వ వేతన సంఘాన్ని నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం రానున్న నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గ్రూప్-సి అధ్యక్ష, కార్యదర్శులుగా యూవీ రమణ, కె.గణపతి, కోశాధి కారిగా వి.డిల్లేశ్వరరావు పోస్టుమేన్ అండ్ ఎంటీఎస్ అధ్యక్ష, కార్యదర్శులుగా టి.వేంకటేశ్వర్లు, ఎల్.బాబూరావు, కోశాధికారిగా ఎం.చిన్నారావు తదితరులను ఎన్నుకున్నారు.



నూతనంగా ఎన్నికైన సంఘ ప్రతినిధులు..

న్యూస్ బాక్స్

అక్టోబరు ఒకటిన రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలు

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): బూర్జపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో అక్టోబరు ఒకటిన రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయుడు, నిర్వాహకుడు రాజబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 29వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 70325 43070, 96760 38018 నెంబర్లలో సంప్రదించాలన్నా విజేతలకు రూ.7777 (ప్రథమ), రూ.5555 (ద్వితీయ), రూ.3333 (తృతీయ), రూ.1555 (చతుర్థ) నగదు బహుమతులు అందజేస్తామన్నారు.

30న జిల్లా స్థాయి పోటీలు


సోంపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇస్కలపాలెం గ్రామంలో దేవీ నవరాత్రుల సందర్భంగా ఈనెల 30న జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుకున్న విద్యార్థులు అర్హులన్నారు. విజేతకు మొదటి బహుమతి రూ.8001, ద్వితీయ 6001, తృతీయ రూ.4001 నగదు పురస్కారం అందించనున్నారు. ఇతర వివరాలకు 95735 74545, 72870 03875, 81069 46410 నెంబ ర్లలో సంప్రదించాలని సూచించారు.

సౌత్‌జోన్ పోటీలకు కిరణ్‌కుమారి

సోంపేట రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మామిడిపల్లి గ్రామానికి చెందిన లండ కిరణ్‌కుమారి యాదవ్ 4వ రాష్ట్ర ఇంటర్ జిల్లా లాక్రోస్ చాంపియన్‌షిప్-2025 పోటీలో బంగారు పతకం సాధించింది. అలాగే కర్నూలులో అక్టోబరు 4, 5 తేదీల్లో నిర్వహించనున్న ఒకటో జోన్ సౌత్ నేషనల్ చాంపియన్‌షిప్-2025 పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా ఆమెను తండ్రి సూర్యనారాయణ, కోచ్ సురేంద్రరెడ్డి, సీఈవో నరేష్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్‌హెచ్‌స్వర్ణబోస్, ప్రిన్సిపాల్ రవితేజ కిరణ్ అభినందించారు.

రొయ్యల చెరువులకు అనుమతులు

శ్రీకాకుళం రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కళ్లేపల్లి పంచాయతీ మోపసుబందర్ రెవెన్యూ పరిధిలో 25 ఎకరాల్లో సాగు చేస్తున్న రొయ్యల చెరువులకు కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ నుంచి 2027 వరకు లైసెన్సు కలిగి ఉన్నామని నెలిమర్ల వెంకట సోమ సుదర్శనరావు, చంద్రశేఖర్ ఆదివారం తెలిపారు. అయితే శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే చెరువులకు విద్యుత్ పునరుద్ధరించాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు.



ఇంద్రకీలాద్రికి దసరా శోభ

నేటి నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

- ఈఏడాది 20 లక్షలమంది భక్తులు వస్తారని అంచనా
- 29న దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి అమ్మవారికి స్నపనాది క్రతువు నిర్వహిస్తారు. తొలిరోజు అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిస్తారు. ఉదయం 8-8.30 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఈ ఏడాది దేశం నలుమూలల నుంచి ఉత్సవాలకు 20 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేశారు. ప్రొటోకాల్ జాబితాలో ఉన్న వీఐపీల కోసం స్లాట్ విధానాన్ని తీసుకొచ్చారు. ఉదయం 7-9, మధ్యాహ్నం 3-5 గంటల వరకు కల్పిస్తారు. ఈ ఏడాది భక్తుల కోసం 20 లక్షల లడ్డూలను సిద్ధం చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల కారణంగా ఇంద్రకీలాద్రి విద్యుత్ వెలుగుల్లో దేదీప్యమానంగా వెలుగుతోంది. 29వ తేదీ మూలానక్షత్రం రోజున అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిస్తారు. ఆరోజు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

విజయవాడలో ట్రాఫిక్ మళ్లింపులు

శరన్నవరాత్రులు ముగిసే వరకు అమలు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై సోమవారం నుంచి ప్రారంభమయ్యే దసరా శరన్నవరాత్రి మహోత్సవాల కారణంగా పోలీసులు ట్రాఫిక్ మళ్లింపులు విధించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విజయవాడ మీదుగా రాకపోకలు సాగించే భారీ వాహనాలను దారి మళ్లిస్తున్నట్టు పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు.

- హైదరాబాద్-విజయవాడ-హైదరాబాద్-విశాఖపట్నం మార్గంలో రాకపోకలు సాగించే భారీ వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్నఅవుటపల్లి వద్ద దిగి హనుమాన్ జంక్షన్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి వాహనాలు చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి నల్లకుంట వద్ద దిగి హైదరాబాద్ మార్గంలోకి వెళ్లాలి.
- హైదరాబాద్ - మచిలీపట్నం-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్నఅవుటపల్లి వద్ద దిగాలి. కేసరపల్లి మీదుగా మచిలీపట్నం చేరుకోవాలి. ఇటు నుంచి వెళ్లే వాహనాలు కేసరపల్లి వద్ద నుంచి చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కాలి.
- హైదరాబాద్-చెన్నై-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నార్కట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, అద్దంకి, మేదరమెట్ల మీదుగా గుంటూరు చేరుకుని అక్కడి నుంచి చెన్నై వెళ్లాలి. చెన్నై నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.
- చెన్నై-విశాఖపట్నం-చెన్నై మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు ఒంగోలు, త్రోవగుంట, చీరాల, బాపట్ల, రేపల్లె, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ బైపాస్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి చెన్నై వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.

నేటి నుంచి శ్రీశైలంలో దసరా మహోత్సవాలు



శ్రీశైలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైల క్షేత్రంలో సోమవారం నుంచి దసరా మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. అక్టోబరు 2వ తేదీ వరకు ఈ వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు అమ్మవారి ఆలయ మండపంలో యాగశాల ప్రవేశం చేసి గణపతిపూజ, స్వస్తిపుణ్యాహవచనం, దీక్షా సంకల్పం, కంకణపూజ, కంకణధారణ తదితర పూజలు నిర్వహించనున్నారు. భ్రమరాంబికాదేవి అమ్మవారు సోమవారం శైలపుత్రి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. స్వామి, అమ్మవార్లకు భృంగి వాహన సేవ నిర్వహించనున్నారు.

ఉత్తరాంధ్రకు వాయు‘గండం’

- పిడుగులతో భారీ వర్షాలు పడతాయని హెచ్చరిక
- బెజవాడలో 13 సెంటీమీటర్ల వర్షం.. నేడు ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు

విశాఖపట్నం/అమరావతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):ఉత్తరాంధ్రకు వాయుగుండం పొంచి ఉంది. ఈ నెల 26న వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడనున్న వాయుగుండం 27న ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా మధ్య తీరం దాటనుంది. దీని ప్రభావం ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా ప్రాంతాలకు ఎక్కువగా ఉంటుందని, కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సోమవారం ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. దీంతో సోమ, మంగళవారాల్లో ఉత్తరాంధ్రలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నెల 25న తూర్పుమధ్య, ఈశాన్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుంది. మూడు రోజుల వ్యవధిలో ఏర్పడనున్న రెండు అల్పపీడనాల ప్రభావంతో ఈనెల 24 నుంచి 27 వరకు కోస్తా, రాయలసీమలో అనేకచోట్ల వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మరోవైపు, కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులు, ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిశాయి. విజయవాడ సింగ్‌నగర్‌లో 13, చిత్తూరు జిల్లాలోని కాగితలో 8.3, ఏలూరు జిల్లా కాకర్లమూడిలో 8, ప్రకాశం జిల్లా సింగరాయకొండలో 6.9, చిత్తూరులోని యాదమర్రిలో 6.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సోమవారం రాష్ట్రంలో పలుచోట్ల ఉరుములు, పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు, ఒకట్రెండుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని నిపుణుడొకరు తెలిపారు.

అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభం వద్ద జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్

సింహాచలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సింహాచలంలోని వరాహలక్ష్మీనృసింహస్వామిని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్ర నాథ్‌రాయ్ దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. న్యాయమూర్తి కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడామండప ప్రదక్షిణ చేసిన అనంతరం అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు తరువాత పండితులు ఆశీర్వచనాలీయగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ఫొటోను జ్ఞాపికగా అందజేశారు.

నేటి నుంచి విశాఖలో 28వ జాతీయ ఈ గవర్నెన్స్ కాన్ఫరెన్స్

- ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుంది
- కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి

విశాఖపట్నం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): విశాఖ వేదికగా 28వ జాతీయ ఈ-గవర్నెన్స్ కాన్ఫరెన్స్‌ను ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించనున్నట్టు కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి వి.శ్రీనివాస్ వెల్లడించారు. విశాఖలో ఆదివారం మాట్లాడుతూ.. వికసిత్ భారత్, సివిల్ సర్వీసెస్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ థీమ్‌తో సదస్సు ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ కాన్ఫరెన్స్‌ను ప్రారంభిస్తారన్నారు. ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుందని, ప్రస్తుతం 738 రకాలు సేవలు అందిస్తున్నారని, దీనిని దేశంలోనే అత్యుత్తమ మోడల్‌గా అభివర్ణించారు. విశాఖ డిక్లరేషన్‌లో దీనిని భాగం చేసి దేశమంతా అమలు చేసేందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి 200 మందికిపైగా ప్రతినిధులు సదస్సులో పాల్గొంటారన్నారు. అత్యుత్తమ కార్యక్రమాలు నిర్వహించిన వారికి ఈ గవర్నెన్స్- 2025 అవార్డులు అందిస్తామన్నారు.

కూటమి నేతలపై అనుచిత పోస్టులు

- వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త అరెస్టు



వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌తో అంజాద్ ఖాన్ (ఫైల్)

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌పై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తను శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు ఎస్పీ సతీష్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. కదిరి పట్టణానికి చెంది న కౌలేపల్లి అంజాద్‌ఖాన్ అలియాస్ మెగా అంజాద్ వైసీపీ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తుండేవాడు. రెండ్రోజుల క్రితం సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టడంతో అరెస్టు చేసినట్లు తెలిపారు.

27లోపు డిమాండ్లు పరిష్కరించాలి

- లేదంటే పెన్షన్ పంపిణీని నిలిపేస్తాం
- ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ

పెనమలూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఈనెల 27 లోపు తమ డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం చర్చలకు పిలవని పక్షంలో అక్టోబరు 1 నుంచి పెన్షన్ పంపిణీని నిలుపుదల చేసేందుకు వెనుకాడబోమని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ హెచ్చరించింది. పోరంకిలో ఆదివారం జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బగ్గా జగదీష్ మీడియాతో మాట్లాడారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో కలెక్టర్లకు, ఇతర అధికారులకు జేఏసీ తరఫున నోటీసులు అందజేస్తామన్నా రు. 26, 27 తేదీల్లో ప్రభుత్వ అధికారులు నిర్వహిస్తున్న అఫిషియల్ వాట్సాప్ గ్రూపుల నుంచి ఉద్యోగులందరూ స్వచ్ఛందంగా వైదొలుగుతారన్నారు. 28న రాయలసీమ వేదికగా కర్నూలు జిల్లాలో ప్రాంతీయ సమావేశం ఏర్పాటుచేసి తదుపరి కార్యాచరణను విడుదల చేస్తామని తెలిపారు.

తిరుమలేశుడి బ్రహ్మోత్సవాలకు రేపు అంకురార్పణ

- ఎల్లుండి ధ్వజారోహణంతో ఉత్సవాలు ఆరంభం

తిరుమల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవేంకటేశ్వరుని సాలకట్ల బ్రహ్మోత్సవాలను ప్రారంభించడానికి మంగళవారం అంకురార్పణ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సాయంత్రం ఆలయంలో సేనాధిపతిని అలంకరించి విశేష సమర్పణ గావిస్తారు. అనంతరం తిరుచ్చిపై ఆశీనులు చేస్తారు. రాత్రి ఏడు గంటలకు ఆలయం నుంచి బయల్దేరి నాలుగు మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. తర్వాత ఆలయానికి చేరుకున్న అనంతరం రంగనాయకమండపంలో ఆస్థానం జరుగుతుంది. యాగశాలలో అర్చకస్వాములు ఆగమోక్తంగా కైంకర్యాలు నిర్వహించి అంకురార్పణ(బీజవాపం) కార్యక్రమం నిర్వహిస్తారు. 24వ తేదీన ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభవుతాయి.

తప్పుడు వార్తలను నమ్మకండి

- కపిలతీర్థంలో ఎలాంటి తొక్కిసలాట జరగలేదు: టీటీడీ

తిరుమల, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): తిరుమలలో తొక్కిసలాట జరిగిందని, కపిలతీర్థంలో ఏర్పాట్లు చేయలేదని సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు వార్తలను భక్తులు నమ్మవద్దంటూ టీటీడీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. ‘మహాలయ అమావాస్య సందర్భంగా తిరుపతి కపిలతీర్థం ఆలయం బయట ప్రైవేట్ వ్యక్తులు పితృతర్పణాల కార్యక్రమం చేసుకోవడం ఆనవాయితీ. ఈక్రమంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్‌ను టీటీడీ ఏర్పాట్లు చేసింది. రద్దీ నేపథ్యంలో భద్రతాపరంగా పటిష్ఠ చర్యలు తీసుకున్నాం. ఎస్పీ వాహనం, పోలీస్ వాహనం రావడంతో తొక్కిసలాట జరిగినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. తిరుమలకు ఏమాత్రం సంబంధం లేకపోయినా ఇక్కడ తొక్కిసలాట అని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కొంతమంది టీటీడీని లక్ష్యం చేసుకుని దుష్ప్రచారం చేయడం సరి కాదు. టీటీడీ ప్రతిష్ఠను పలుచన చేయడాలని చూడటం వారి దిగజారుడుతనానికి నిదర్శనం. ఇలాంటి వార్తలను నమ్మవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. టీటీడీపై దుష్ప్రచారం చేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం’ అంటూ టీటీడీ తన సోషల్ మీడియా ద్వారా పేర్కొంది.

విజ్ఞాన్ వర్సిటీలో 62వ జాతీయ చెస్ చాంపియన్ షిప్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు విద్య, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ద్రోణాచార్య అవార్డు గ్రహీత కోనేరు అశోక్ మాట్లాడుతూ ఆలిండియా చెస్ ఫెడరేషన్ విభాగంలోని ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విశ్వనాథన్ ఆనంద్, హరికృష్ణ, హంపి, హరిదాసన్, ప్రగ్నానంద లాంటి ప్రతిభావంతులు దేశానికి ఎనలేని కీర్తి తెచ్చారని అశోక్ కొనియాడారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మొదటగా ఒక ఎత్తు వేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలిండియా చెస్ ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ లాల్తమునా, చీఫ్ ఆర్బిటర్ అనంత రామన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏ.సురేష్, చీఫ్ అడ్వయిజర్ కేవీవీ శర్మ, సెక్రటరీ కే.జగదీష్, గుంటూరు చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్ రవీంద్రరాజు, దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన ఆటగాళ్లు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు



కబడ్డీ ఆడుతున్న ప్రకాశం, నెల్లూరు జట్లు

కోటబొమ్మాళి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కొత్తమ్మతల్లి ఉత్సవాల్లో భాగంగా నాలుగు రోజులు పాటు జరగనున్న బాలికలు, పురుషుల రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ప్రభుత్వ పాఠశాల మైదానంలో ఆదివారం సాయంత్రం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షులు వై.వెంకన్న చౌదరి, టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి పోటీలను ప్రారంభించారు. తొలుత ప్రకాశం, నెల్లూరు బాలికల జట్లు, అనంతపురం, విజయనగరం పురుషుల జట్ల మధ్య కబడ్డీ పోటీలు జరిగాయి. ఈ పోటీలలో మొత్తం 12 బాలికల కబడ్డీ జట్లు, 21 పురుషుల జట్లు పాల్గొంటున్నాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, జడ్పీ సీఈవో ఎల్.వి.ఎన్.శ్రీధర్‌రాజా, తహసీల్దార్ అప్పలరాజు, ఎంపీడీవో ఫణీంద్రకుమార్, నెహ్రూ యూత్ కోఆర్డినేటర్ వెంకట్ ఉజ్వల్, కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి ఎ.చిరంజీవరావు, డీఎస్పీ లక్ష్మణరావు, జిల్లా కబడ్డీ ఆర్గనైజేషన్ సెక్రటరీ ఆర్.అప్పలస్వామి క్రీడాభిమానులు పాల్గొన్నారు.

‘వంద’నాలమ్మా.. కొత్తమ్మతల్లీ

(ఐదో పేజీ తరువాయి)

ప్రత్యేక దర్శనాల కోసం ఏర్పాట్లు చేశారు. ఉచిత ప్రసాదం అందజేయనున్నారు. భోజనాలు పెట్టనున్నారు. బుధవారం సాయంత్రం సుమారు 50వేల మంది భక్తులతో కొత్తపేట జంక్షన్ నుంచి కోటబొమ్మాళి పెద్దచెరువు వరకు శోభాయాత్ర నిర్వహించనున్నారు. రాష్ట్రస్థాయి పురుషులు, మహిళలతో కబడ్డీ పోటీలతోపాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రావీణ్యం పొందిన సంగిడీ రాళ్ల, ఈడుపురాయి, ఉలవల బస్తాలు పోటీలు మంగళ, బుధవారాల్లో జరుగుతాయి. అలాగే పగటివేషాలు, కొయ్య డ్యాన్సులు కూడా ఏర్పాటు చేశారు. మంగళ బుధవారాల్లో రాత్రి 10 గంటలకు ఢీ, జబర్దస్త్ నటీనటులతో ప్రదర్శనలు ఉంటాయి. గురువారం రాత్రి శ్రీరామాంజనేయ యుద్ధం, గయోపాఖ్యానం, సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శిస్తారు.

ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావు, సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సుమారు 800 పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే 9440795835, 08942238633 నెంబర్లకు ఫోన్ చేయాలని ఎస్ఐ వి.సత్యన్నారాయణ సూచించారు.

ఒక్క అంశమూ చర్చించలే

(ఐదో పేజీ తరువాయి)

సభ జరగనిస్తాం. లేదంటే జరగనీయబోమ’ని మూకుమ్మడిగా సభలో చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రొటోకాల్‌ను ప్రతి ఒక్క అధికారి పాటించాల్సిందేనని.. ఎవరికైనా అనుమానాలు తలెత్తినప్పుడు జిల్లా రెవెన్యూ అధికారిని సంప్రదించి నివృత్తి చేసుకోవాలని వెల్లడించారు. జిల్లాపరిషత్ సీఈవో శ్రీధర్‌రాజు బదులిస్తూ.. ఈ ఘటనపై విచారణకు ఆదేశించామని.. కమిషనర్‌కు కూడా పంపామని.. ప్రశ్న అడిగేవారు.. తాను చెప్పేది కూడా వినాలని కోరారు. ‘మీరు చెప్పేది వినేందుకు మేములేము. మేము చెప్పేది మీరు వినాలి. ఎంపీడీవోపై చర్యలు తీసుకోనందుకు సభ నుంచి వెళ్లిపోతున్నామ’ంటూ వైసీపీ జడ్పీటీసీలు, ఎంపీపీలు పోడియం వద్దకు వచ్చి.. జడ్పీ సీఈవోను ప్రశ్నించి వెళ్లిపోయారు. జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ కూడా వారికి మద్దతు పలికి వాకౌట్ చేస్తున్నామంటూ సభ నుంచి వెళ్లిపోయారు. దీంతో సమావేశంలో ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు, జిల్లాలో టీడీపీకి చెందిన ఒకేఒక్క జడ్పీటీసీ (హిరమండలం) పొగిరి బుచ్చిబాబు అలా కూర్చున్నారు. కొద్దిసేపు అనంతరం జడ్పీ సీఈవో మా ట్లాడుతూ.. చైర్మన్‌తోపాటు, సభ్యులు కూడా లేకపోవడంతో సర్వసభ్య సమావేశంను ముగిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో అధికారులు కూడా వెళ్లిపోయారు. ఏ ఒక్క సమస్యను చర్చించకుండా ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ముగియడం ఇదే తొలిసారి.

పిల్లలపై ఓ కన్నేయండి

(ఐదో పేజీ తరువాయి)

పిల్లలకు ఈత పెద్దగా తెలియదు. అటువంటి వారు గ్రామాలకు వచ్చి తోటి పిల్లలతో సరదాగా ఈతకు వెళుతుంటారు. ఈ క్రమంలో ఈతరాక ప్రమాదాలకు గురవుతుంటారు. అటువంటి వారి విషయంలో తల్లిదండ్రులు ఒక కన్నేసి ఉంచాలి. చెరువులు, కాలువల వైపుగా వెళ్లి నప్పుడు.. పెద్దవారి తోడు తీసుకొని వెళ్లాలని వివరించాలి.

● కొందరు పిల్లలు తల్లిదండ్రులకు చెప్పకుండా ఇంట్లో ఉన్న వాహనాలను తీసుకొని రోడ్లపైకి వచ్చేస్తుంటారు. మితిమీరిన వేగానికి తోడు రహదారి భద్రత పాటించడం లేదు. ఈ క్రమంలో కొన్నిసార్లు ప్రమాదాలు జరిగి.. బాధిత కుటుంబాల్లో తీరని విషాదం నింపుతున్నాయి. అందుకే పిల్లల చేతికి వాహనాలు ఇవ్వకపోవడమే శ్రేయస్కరం.

● ఆన్‌లైన్ తరగతులు, అదనపు పరిజ్ఞానం కోసమంటూ చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లల చేతిలో సెల్‌ఫోన్లు పెడుతుంటారు. దాంతో ఎంతో ప్రయోజనమో చెప్పలేం కానీ అనర్థాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఫొటోల యాప్స్ మొదలు ఆన్‌లైన్ గేమ్స్ వరకూ అన్ని యాప్‌ల గురించి పిల్లలు తెలుసుకుంటున్నారు. సోషల్ మీడియాలో అకౌంట్లు తెరుస్తున్నారు. వారు నేర్చుకునే విషయాలు ఎటువైపునకు దారి తీస్తాయో అనేది తల్లిదండ్రులు గ్రహించాలి.

● జిల్లాలో మైనర్లు, విద్యార్థులు మత్తు బారిన పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. స్నేహితుల్లో ఎవరికో ఒకరికి గంజాయి, డ్రగ్స్, సిగరెట్ అలవాటు ఉంటే మిగతావారు ఆకర్షితులవుతున్నారు. సరదాగా ఒకసారి అనే మాటగా మొదలై.. మత్తు అనే మాయలో పడేస్తోంది. అందుకే సెలవుల్లో పిల్లల విషయంలో తల్లదండ్రులు చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

జాగ్రత్తలు తీసుకోవాలి..

దసరా సెలవుల్లో పిల్లలను కంటికి రెప్పలా చూసుకోవాలి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో చెరువులు, కాలువలు నీటితో కళకళలాడుతున్నాయి. నదితీర ప్రాంతాలకు వెళ్లనీయకూడదు. ద్విచక్ర వాహనాలు ఇవ్వొద్దు. పిల్లలు వెంటే ఉంటూ తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంచడం మంచిది. సృజనాత్మకత పెంచేలా ఇంటి వద్ద బొమ్మలు, నీతికథలు, పుస్తక పఠనంపై శ్రద్ధ చూపేలా చర్యలు తీసుకోవాలి.

-రవిబాబు, డీఈవో, శ్రీకాకుళం

కంకర దోపిడీ!

(ఐదో పేజీ తరువాయి)

ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో కొన్నాళ్లు కంకర తవ్వకాలు నిలిపేశారు. కానీ మళ్లీ ప్రస్తుతం కంకర తవ్వకాలు జోరుగా సాగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రణస్థలం తహసీల్దారు కార్యాలయం, పోలీస్‌స్టేషన్, మీదుగా సమీపంలోని పారిశ్రామిక అవసరాలు, గృహనిర్మాణాలకు అనుమతులు లేకుండా వందలాది లోడ్లు కంకరను తరలిస్తున్నారని ఆరోపిస్తున్నారు. కంకర తవ్వకాల కారణంగా పశుగ్రాసం కూడా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. కొండను పరిరక్షించడంలో అధికారులు విఫలమవుతున్నారని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తవ్వకాలకు చెక్‌పెట్టి.. కొండను పరిరక్షించాలని కోరుతున్నారు.

● చర్యలు తీసుకుంటాం..

కొండములగాం కొండపై కంకర తవ్వకాలకు ఎటువంటి అనుమతులు లేవు. ఎవరైనా తవ్వకాలు చేపడితే కఠినచర్యలు తీసుకుంటాం. ఇప్పటికే దీనిపై ఫిర్యాదులు వస్తున్నాయి. సిబ్బందిని అప్రమత్తం చేశాం. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

-శనపల కిరణ్‌కుమార్, తహసీల్దారు, రణస్థలం

దసరా కానుక!

(ఐదో పేజీ తరువాయి)

ధరలు మరింత తగ్గడంతో.. కొనుగోళ్లు బాగా పెరగనున్నాయని భావిస్తున్నారు.

కారును కొనుగోలు చేస్తా..



ఎప్పటి నుంచి కారును కొనుగోలు చేయాలనుకుంటున్నాను. కానీ జీఎస్టీ భారంతో అధికంగా ధరలు ఉండడంతో కొనుగోలు చేయలేకపోయాను. ప్రస్తుతం కేంద్రం జీఎస్టీ ధరలు తగ్గించనుండడంతో.. ఈ దసరాకా కొత్తకారు కొనుగోలు చేస్తాను.

-పొట్నూరు శంకరరావు, మాజీ సైనిక ఉద్యోగి, టెక్కలి

ధరలు తగ్గడం మంచిదే..



నిత్యావసర వస్తువుల ధరలు తగ్గితే మాలాంటి సామాన్య ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. రోజంతా పని చేస్తే కూలి రూ.600 వస్తుంది. నిత్యావసర సరుకుల ధరలు అధికంగా ఉండడం వల్ల కూలి డబ్బులు కూడా సరిపోవడం లేదు. ధరలు తగ్గుతున్నాయని తెలిసి సంతోషిస్తున్నాం.

-దేశారి బింజయ్య, రైతుకూలీ, జి.జగన్నాథపురం

సామాన్యులకు వరం..



కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో సామాన్యులకు వరంలా మారనుంది. వస్తువులు కొనుగోలు చేసుకోవాలనే చాలామంది కల నెరవరనుంది. అధికంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టే అవకాశం ఉంది.

-బి.దినకర్‌రావు, గిరిజన సంఘం నాయకుడు, బందపల్లి

నవరాత్రి ఉత్సవాలకు సన్నద్ధం



జలుమూరు (సారవకోట), సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అవలింగి గ్రామంలో వెలసిన నీలమణి దుర్గాదేవి సన్నిధిలో సోమవారం నుంచి దసరా నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు చల్లపల్లి భాస్కరరావు తెలిపారు. ఉత్సవాల ప్రారంభం రోజున బుడితి, చీడిపూడి, అవలింగి గ్రామాల్లో అమ్మవారి శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా నీలమణి దుర్గాదేవి రోజుకొక అవతారంలో భక్తులకు దర్శనమిస్తారని చెప్పారు.

అవలింగిలో కొలువుదీరిన నీలమణిదుర్గ

గుంటూరులో 3వ ప్రపంచ తెలుగు మహాసభలు

- జనవరి 3 నుంచి 5 వరకు నిర్వహణ: గజల్ శ్రీనివాస్



మాట్లాడుతున్న గజల్ శ్రీనివాస్

శ్రీకాకుళం కల్చరల్/శ్రీకాకుళం రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రసారస్వత పరిషత్, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో 3వ ప్రపంచ తెలుగు మహాసభలను 2026 జనవరి 3 నుంచి 5వ తేదీ వరకు గుంటూరులో నిర్వహించనున్నట్లు ప్రముఖ గజల్ కళాకారుడు గజల్ శ్రీనివాస్ తెలిపారు. మునసబుపేటలోని ఓ ప్రైవేటు కళాశాలలో విశ్వసాహితీ కళావేదిక, ఆంధ్ర సారస్వత పరిషత్, గురజాడ సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం నవజీవ కవితా మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవిదేశాల నుంచి, వివిధ రాష్ట్రాల నుంచి తెలుగు ప్రతినిధులు పాల్గొంటారని, చలనచిత్ర ప్రదర్శన, కవి సమ్మేళనాలు, సదస్సులు, హస్తకళలు, పుస్తక, చిత్ర కళా ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తెలుగు మహాసభలకు ప్రతిఒక్కరూ పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు. అంబేడ్కర్ వర్సిటీ వీసీ కేఆర్ రజని మాట్లాడుతూ.. యువత అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పలువురు కవులు, రచయితలు గురజాడ సాహిత్యంపై కవిత్వం, రచనలను చదివి వినిపించారు. ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ, విశ్వసాహితీ అధ్యక్షురాలు కె.రమావతి, విద్యాసంస్థల అధినేత జీవీ స్వామినాయుడు, ప్రిన్సిపాల్ కేవీవీ సత్యనారాయణ, జంధ్యాల శరత్ బాబు, గౌరీ శంకర్, ఇ.వేమన, ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.